నమస్తే తెలంగాణ

# సిద్దిపేట

5 హైదరాబాద్, సోమవారం 8 జనవరి 2024 SIDDIPET




స్వామి వారి ఉత్సవ విగ్రహాలను కల్యాణోత్సవానికి ఊరేగింపుగా తీసుకువస్తున్న ఆలయ అర్చకులు

## కనుల పండువగా ఊరేగింపు

స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అర్చకులు ఆలయం నుంచి పోలీసుబొమ్మ, రాతిగీరలు, ఆలయ పరిసరాల్లో ఊరేగింపుగా నిర్వహిస్తూ కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. మధ్యప్రదేశ్ ఉజ్జయిని పీఠాధిపతి సిద్ధలింగరాజ దేశికేంద్ర శివాచార్యుల పర్యవేక్షణలో కల్యాణోత్సవం జరిగింది. నడిపుడి మఠం భావనయ్యస్వామి, భువనేశ్వర స్వామి, ఆనందయ్య, జ్ఞానేశ్వర్‌శాస్త్రి, చంద్రశేఖర్ స్వామి, భద్రయ్యస్వామి పురోహితులుగా, వ్యాఖ్యాతలుగా డాక్టర్ మహంతయ్య, నందుల మఠం శశిభూషణ సిద్ధాంతి స్వామీజీలు వ్యవహరించారు. ఉదయం 5గంటలకు ఆలయవర్గాలు రెండు క్వింటాళ్ల బియ్యాన్ని అన్నం వండి రాశిగా తయారుచేసి దృష్టికుంభం కార్యక్రమాన్ని నిర్వహించారు.

## అమ్మవార్లకు స్వర్ణ కిరీటాలు

కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవేరులైన బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలకు వచ్చే కల్యాణోత్సవానికి దేవాదాయశాఖ తరపున మంత్రి కొండా సురేఖ స్వర్ణ కిరీటాలు సమర్పించనున్నట్లు వేదిక వద్ద ఆలయ అర్చకులు ప్రకటించారు. కాగా, ఆలయంలో స్వామి వారిని ఆమె కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మల్లికార్జున స్వామి దర్శనం అనంతరం రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడారు. మల్లికార్జునస్వామి క్షేత్రాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తున్నదన్నారు. మల్లన్న ఆశీర్వచనం అందరికీ ఉండాలన్నారు. మహాలక్ష్మి పథకానికి ఆదరణ వస్తున్నదని, బస్సుల సంఖ్యను మరింత పెంచుతామని ప్రకటించారు ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



మల్లన్నకు శతకోటి దండాలు..



కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి



కొమురవెల్లిలో మల్లన్న కల్యాణం జరుపుతున్న అర్చకులు

# కల్యాణం.. వైభోగం

- అంగరంగ వైభవంగా కొమురవెల్లి మల్లన్న లగ్గం
- మార్మోగిన శైవక్షేత్రం
- రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి కొండా సురేఖ
- హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి
- ఆకట్టుకున్న కార్యక్రమాలు

సిద్దిపేట ప్రతినిధి/ చేర్యాల, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : మేళతాళాలు.. మంగళ వాయిద్యాలు.. భక్తుల జయజయధ్వానాల మధ్య కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. మల్లన్న స్వామి...మమ్మేలు అంటూ భక్తులు చేసిన నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆదివారం సిద్దిపేట జిల్లా మల్లన్న క్షేత్రంలోని తోట బావి కల్యాణ వేదిక వద్ద లగ్గం జరిగింది. కల్యాణాన్ని వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కల్యాణోత్సవంలో స్వామి వారి తరపున పడిగన్నగారి మల్లికార్జున్ దంపతులు, అమ్మవార్ల తరపున మహాదేవుని మనోహర్ దంపతులు పాల్గొన్నారు. అమ్మవారి తరపున మహాదేవుని సాంబయ్య, స్వామి వారి తరపున పడిగన్న గారి మల్లయ్య దంపతులు పాల్గొని కల్యాణ తంతు నిర్వహించారు.



కల్యాణ వేదిక వద్ద మాట్లాడుతున్న ఉజ్జయని పీఠాధిపతి

### పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి కొండాసురేఖ

కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం సందర్భంగా ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి. మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కలిసి సమర్పించారు. ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు, ఈవో ఎ.బాలాజీ, ఏఈవో వైరాగ్యం అంజయ్య,అర్చకుల ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అంతకు ముందు కొమురవెల్లి గ్రామ సంప్రదాయం మేరకు సర్పంచ్ సార్ల లతాకిష్టయ్య దంపతులు, ఒగ్గు పూజారులు పట్టు వస్త్రాలు, పుస్తె మట్టెలను సమర్పించారు.జడ్పీ చైర్ పర్సన్ వేలేటి రోజాశర్మ, సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్డీవో రమేశ్, ఎంపీపీలు తలారీ కీర్తనాకిషన్, బద్దిపడిగె కృష్ణారెడ్డి, పుల్లంపల్లి కరుణాకర్, జడ్పీటీసీలు సిలువేరు సిద్ధప్ప, గిరి కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

### కల్యాణం

స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సరం మార్గశిర మాసం ఏకాదశి ఉదయం 10.45 గంటలకు నిర్వహించాల్సిన కల్యాణం ఆలస్యంగా జరిగింది. కొమురవెల్లి పుణ్యక్షేత్రంలోని ఇంద్రకీలాద్రి ఆలయ ప్రాంగణంలోని తోటబావి వద్ద నిర్మించిన కల్యాణ వేదిక వద్ద స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అంతకు ముందు ఊరేగింపుగా వెళ్లి స్వామివారి తరపున మహాదేవుని వంశస్తులు, పడిగన్నగారి వంశస్తులు కూర్చుని కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి తాళి, మట్టెలు, ఒడి బియ్యం, బట్టలు తీసుకొచ్చారు. మధ్యాహ్నం 12గంటలకు రుద్రాభిషేకం, సాయంత్రం శకటోత్సవం నిర్వహించారు.



మంగళ సూత్రాలను భక్తులకు చూపిస్తున్న ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్



కల్యాణానికి హాజరైన ప్రజాప్రతినిధులు తదితరులు

### కల్యాణోత్సవం.. ఆలస్యం

స్వామివారి కల్యాణోత్సవం నిర్దేశించిన సమయానికి కాలేదు. మంత్రుల రాక ఆలస్యం కావడంతో గంట ఆలస్యంగా ఆలయవర్గాలు కల్యాణ తంతును ప్రారంభించాయి. ఉదయం 10.45 గంటలకు జరగాల్సిన పెండ్లి ఆలస్యం కావడంతో భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కల్యాణ వేదిక వద్దకు మొదటగా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని 10.45గంటలకు, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను 11.28 గంటలకు తీసుకొచ్చారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను 11.38గంటలకు తీసుకొచ్చిన అనంతరం కల్యాణం జరిగింది. మాంగళ్య ధారణ 12.28 గంటలకు అర్చకులు పూర్తి చేశారు.

### గందరగోళం.. భక్తుల ఇక్కట్లు

మల్లన్న కల్యాణోత్సవం ఆద్యంతం గందరగోళంగా మారింది. దీంతో భక్తులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. స్వామి వారి కల్యాణ వేదిక వద్ద గ్యాలరీల మార్పుతో డోనర్లు, భక్తులు, వీవీఐపీలు, మీడియా ప్రతినిధులు కల్యాణోత్సవాన్ని వీక్షించలేక ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా కల్యాణ వేదికపై స్టీల్ బారికేడ్లు ఏర్పాటు చేయడంతో కల్యాణోత్సవంలో ఏం జరుగుతున్నది, ఎవరెవరు హాజరయ్యారు అనే కనీస సమాచారం లోపించింది. గ్యాలరీల నుంచి తాళాలు వేసి ఒక్కోదాని తర్వాత ఒకటి వదిలిపెట్టేందుకు పోలీస్‌వర్గాలు యత్నించడంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. అన్నిరకాల పాస్‌లను ఇష్టారాజ్యంగా పంపిణీ చేశారు. కల్యాణ వేదిక వద్ద వేసిన కుర్చీల సంఖ్యకు ఎక్కువగా ప్రజలు తరలిరావడంతో నిలబడి కల్యాణం చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సరైన సమయానికి మంత్రులు వస్తారని కల్యాణ వేదిక వద్దకు వచ్చిన ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి సుమారు గంటపాటు నిరీక్షించారు. అనంతరం మంత్రులు రావడంతో ఎమ్మెల్యే పల్లా పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాకప్పి సన్మానించి స్వాగతం పలికారు.

### మల్లన్నకు తగ్గిన కట్నాలు..

గతేడాది జరిగిన కల్యాణోత్సవం సందర్భంగా మల్లన్నస్వామికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు రూ.5లక్షలకు పైగా కట్నాలు సమర్పించుకున్నారు. కానీ, ఈసారి కల్యాణోత్సవం సందర్భంగా మంత్రి కొండా సురేఖ రూ.5116, పొన్నం ప్రభాకర్ రూ.5116, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రూ.5116, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి రూ.5116, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రూ.5,116, కొండా సురేఖ కుమార్తె సుష్మితాపటేల్ రూ.21,116తో పాటు మరికొందరు వీఐపీలు చదివించిన కట్నాలు కేవలం లక్షలోపే కావడం గమనార్హం.

---

### కేసీఆర్ కప్ సీజన్ -3 విజేత

# అంబేద్కర్ ఆజాద్ జట్టు



సిద్దిపేటలో క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఆర్గనైజర్స్

సిద్దిపేట, జనవరి 7 : కేసీఆర్ కప్ సీజన్ –3 విజేతగా అంబేద్కర్ ఆజాద్ జట్టు నిలిచింది. ఆదివారం సిద్దిపేటలోని ఆచార్య జయశంకర్ స్టేడియంలో మిట్టపల్లి వర్సెస్ అంబేద్కర్ ఆజాద్ జట్ల మధ్య జరిగిన పోరులో మిట్టపల్లి పై అంబేద్కర్ ఆజాద్ జట్టు విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన అంబేద్కర్ ఆజాద్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. అంబేద్కర్ ఆజాద్ జట్టులో మహ్మద్ అర్బాజ్ 44 పరుగులతో రాణించారు. అనంతరం 129 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన మిట్టపల్లి జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించిన మహ్మద్ అర్బాజ్ ఒక వికెట్ తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ సిద్దిపేట క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటాలనే లక్ష్యంతో సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు స్టేడియాన్ని తీర్చిదిద్దారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్స్ మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, సిద్దిపేట క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మల్లికార్జున్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సద్ది నాగరాజురెడ్డి, అక్తర్‌పటేల్, రియాజ్ పాల్గొన్నారు.



మ్యాచ్‌లో తలపడుతున్న ఇరుజట్ల క్రీడాకారులు

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహిస్తాం



గజ్వేల్‌లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్న మైదానాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఒలింపిక్, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్

గజ్వేల్ అర్బన్, జనవరి7: గజ్వేల్‌లో 49వ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహిస్తామని రాష్ట్ర ఒలింపిక్, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ అన్నారు. గజ్వేల్ పట్టణంలో ఈనెల 11వ తేదీ నుంచి జరుగనున్న 49వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ఏర్పాట్లను కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు వంటేరు ప్రతాప్ రెడ్డితో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. క్రీడాకారులకు సౌకర్యాలు, క్రీడా మైదానంలో ఏర్పాట్లు, అఫీషియల్స్ షూట్స్, తదితర అంశాలపై ఆర్గనైజేషన్ కమిటీల వివరాలు తెలుసుకుని అభినందించారు. రాష్ట్ర కబడ్డీ ఫెస్టివల్ పోటీల్లో వెయ్యి మందికి పైగా క్రీడాకారులు, 200 మంది అఫీషియల్స్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ముఖ్యులు మొత్తం 1500 మంది వరకు పాల్గొననున్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవికుమార్, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు మద్ది మహేందర్‌రెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్, ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, కోశాధికారి సత్యం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కార్యకర్తలు అధైర్యపడొద్దు



హుస్నాబాద్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

- తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే
- బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుదాం
- గెలిచినా, ఓడినా కార్యకర్తలకు అందుబాటులోనే ఉంటాం
- మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్
- హుస్నాబాద్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

హుస్నాబాద్, జనవరి 7: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యామని కార్యకర్తలెవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని, భవిష్యత్ అంతా బీఆర్‌ఎస్ దేనని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లోని శుభం గార్డెన్‌లో ఆదివారం జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014కు ముందు నిరాశ, నిస్పృహలతో ఉన్న ప్రజలను చైతన్యం చేసి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను పదేండ్లలో దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. రాష్ట్రాన్ని బంగారు పల్లెంలో పెట్టి కాంగ్రెస్‌కు అప్పగిస్తే వారు అసత్య ప్రచారం చేస్తూ బీఆర్‌ఎస్‌ను బద్నాం చేసే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలకు ముందు రైతుబంధు కోసం రూ.7 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడితే కాంగ్రెస్ అడ్డుకున్నదన్నారు. పదేండ్లలో 1.61 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసి, మరో 43వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. 2లక్షల ఉద్యోగాలు ఏడాదిలోపు ఇస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

### ఓడినా.. కార్యకర్తలను కాపాడుకోవడమే లక్ష్యం

ఎన్నికల్లో గెలిచినా ఓడినా కార్యకర్తలను కాపాడుకోవడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఎంతో చైతన్యవంతులని, కొన్ని ప్రతికూల పరిస్థితుల వల్ల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని చవిచూశామని, వచ్చే ఎన్నికల్లో సత్తా చాటాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని, వాటిని ప్రజలు గుర్తించలేక పోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందో వేచి చూడాలని, ఆ పార్టీ ఇచ్చిన హామీలను ఎంతవరకు నెరవేర్చుతుందో ప్రజలు త్వరలోనే గుర్తిస్తారన్నారు. గ్రామస్థాయి నుంచి మరోసారి పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేసుకొని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ సత్తా చాటాలని కార్యకర్తలను కోరారు. సమావేశంలో హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నాయకులు గోపాల్‌రావు, పన్యాల భూపతిరెడ్డి, కర్ర శ్రీహరి, దేవేందర్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితా వెంకట్, ఎంపీపీలు మానస, మాలోతు లక్ష్మీ, కొక్కుల కీర్తి, అనిత, స్వప్న, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, అన్వర్, ఆవుల మహేందర్, మామిడి అంజయ్య, ఆకుల వెంకట్, ఏడు మండలాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు